అకాల వర్షం.. తడిసిన ధాన్యం

నవీపేట మండలం అనంతగిరి గ్రామంలో తడిసిన ధాన్యం

ఇందల్వాయిలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఏప్రిల్ 20 : అకాల వర్షంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. శుక్ర, శనివారాల్లో కురిసిన అకాలవర్షాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చేతికొచ్చిన ధాన్యాన్ని విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో శుక్రవారం సాయంత్రం బలమైన ఈదురుగాలులతో రెండు గంటల పాటు కురిసిన అకాల వర్షం రైతుల ఆశలను అడియాశలు చేసింది. భారీ వర్షంతో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. టార్పాలిన్లు కప్పుతూ ధాన్యం కుప్పలు తడవకుండా తంటాలు పడుతున్నారు. ఈదురు గాలులకు ఇండ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. చెట్లు నేలకొరిగాయి. రూరల్ మండలంలోని కాలూర్, కొండూర్, తిర్మన్‌పల్లి, జలాల్‌పూర్, ఖానాపూర్ గ్రామాల్లో కోతకు వచ్చిన వరి పంట ఈదురుగాలులకు నేలకొరిగింది. ఆయా గ్రామాల్లో 187 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని మండల వ్యవసాయాధికారి హీరాజాదవ్ తెలిపారు. ఈదురుగాలులకు కాలూర్ –జన్నేపల్లి ఎక్స్ రోడ్డుపై రెండు చెట్లు నేలకొరిగాయి. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇందల్వాయిలో ఆరబెట్టిన ధాన్యం పెద్ద మొత్తంలో తడిసిపోయింది.

వరి పంటల పరిశీలన

సారంగాపూర్/ ఇందల్వాయి, ఏప్రిల్ 20 : డిచ్‌పల్లి, ఇందల్వాయి మండలాల్లోని కొనుగోలు కేంద్రాల వద్ద తడిసిన ధాన్యాన్ని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి శనివారం పరిశీలించారు. డిచ్‌పల్లి మండలంలోని దూస్‌గాం తండా, ఇందల్వాయి మండలకేంద్రంతోపాటు గన్నారం, చంద్రాయన్‌పల్లి గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులు అధైర్యపడొద్దని, ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. బాధిత రైతులు పంట నష్టం వివరాలను అధికారులకు తెలుపాలని, సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి పరిహారం అందేలా చూస్తానని అన్నారు.

రూరల్ మండలంలో అకాలవర్షానికి దెబ్బతిన్న వరి పంటలను జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ శనివారం పరిశీలించారు. పంట నష్టం అంచనాల వివరాల నివేదికను తయారుచేసి అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. కమ్మర్‌పల్లి మండలంలో శనివారం ఉదయం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఉప్లూర్ పరిధిలో పలు పంటలకు నష్టం వాటిల్లింది. వరి, నువ్వు, సజ్జ పంటలు నేల వాలాయి. అమీర్‌నగర్‌లో నాలుగు నివాస గృహాల పైకప్పు రేకులు లేచిపోయాయి. రెండు గుడిసెల పైకప్పులు దెబ్బతిన్నాయి. సర్పంచ్ తండాలో నాలుగు నివాస గృహాలు దెబ్బ తిన్నాయి. దెబ్బ తిన్న ఇండ్లను ఆర్ఐ శరత్‌కుమార్ పరిశీలించారు. నివేదికను తహసీల్దార్ ఆంజనేయులుకు అందజేస్తామన్నారు.

ఏర్గట్ల మండలంలోని పలు చోట్ల రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిసింది. నందిపేట్ సబ్‌డివిజన్‌లో 50 విద్యుత్ స్తంభాలు, 5 ట్రాన్స్‌ఫార్మర్లు డీపీ స్ట్రక్చర్స్ పడిపోయాయి. దెబ్బ తిన్న విద్యుత్ స్తంభాలను డీఈఈ శ్రీనివాస్‌రావు, ఏడీఏ అశోక్ పరిశీలించారు. మండలంలో పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో మండల వ్యవసాయాధికారి పరిశీలించారు. 230 ఎకరాల్లో వరి, ఐదెకరాల్లో మామిడి పంట దెబ్బతిన్నట్లు గుర్తించారు. అకాల వర్షానికి నష్టపోయిన రైతులకు ఆదుకోవాలని సీపీఐఎంఎల్ నాయకులు కోరారు. ఖుద్వాన్‌పూర్ గ్రామంలో దెబ్బతిన్న రైతుల పంటలను పరిశీలించారు. మాక్లూర్ మండలంలో కోతకు వచ్చిన పంట నేలకొరిగింది. మామిడికాయలు నేల రాలాయి. నవీపేట మండలంలోని ధర్మారం, అనంతగిరి, మోకన్‌పల్లి తదితర గ్రామాల్లో వడగండ్ల వానకు 80 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి సురేశ్‌గౌడ్ పేర్కొన్నారు. నవీపేట మండలంలోని అబ్బాపూర్(ఎం) గ్రామంలో 9 స్తంభాలు, అభంగపట్నంలో రెండు, జన్నేపల్లి తదితర గ్రామాల్లో 14 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నట్లు ట్రాన్స్‌కో అధికారులు చెప్పారు. ధర్మారం గ్రామంలో మూడు రేకుల షెడ్లు వర్షానికి దెబ్బ తిన్నట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరేశ్ చెప్పారు.

కాంటా పెట్టుడే లేటుండె...

మాక్లూర్: ఆరబెట్టిన ధాన్యం మొత్తం తడిసిపోయింది. మొన్నటి దాకా వడ్లను మంచిగ ఎండివెట్టినం. కాంటా పెట్టుడే లేటుండె. రాత్రి ఒక్కసారిగా పెద్ద వానొచ్చింది. ఏమ్ చేయలేకపోయినం. మళ్లీ వారం పది రోజులు ఆరబెట్టాలె.

-మచ్చర్ల నడ్పి బాబన్న, మాక్లూర్

వడ్లన్నీ తడిసిపోయినయ్..

మాక్లూర్: కాంటా పెట్టిన వడ్లు సంచుల్లో నింపి పెట్టినం. లారీల కోసం ఎదురు చూస్తున్నం. వర్షానికి 160 వడ్ల సంచులన్నీ తడిసిపోయినయ్. తడిసిన వడ్లు రైస్‌మిల్లు వాళ్లు తీసుకుంటరో లేదో? మళ్లీ ఎండవెట్టాల్నేమో! **-ఉరడి సాయిలు, మాక్లూర్**

వడ్లు వానపాలైనయ్..

ఇందల్వాయి: అమ్మడానికి రెండు ట్రాక్టర్ల వడ్లు తెచ్చిన. తేమ పోవడానికి రోజూ ఎండపెడుతున్నం. చెడగొట్టు వానకు మొత్తం తడిసిపోయినయ్. అందరి వడ్లు కల్లాల్లోనే ఉన్నయ్. కాంగ్రెస్ సర్కారు ఆదుకోవాలె. **- లింబయ్య, ఇందల్వాయి**

తడిసిన వడ్లు కొనాలె..

నవీపేట: రాత్రంతా పెద్ద వర్షం వచ్చింది. చేసిన కష్టమంతా పోయింది. వానకు వడ్లన్నీ తడిసిపోయినయ్. ధాన్యం రంగు మారుతున్నది. తడిసి వడ్లను కూడా ప్రభుత్వం ఇదే ధరతో కొనాలె. లేకపోతే మా బడుతుకు ఆగమైతయ్.

- కిషన్, రైతు, అనంతగిరి

అమీర్‌నగర్‌లో లేచిపోయిన ఇంటి పైకప్పు

ఏర్గట్లలో తడిసిన ధాన్యం

కాలూర్‌లో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు, గన్నారంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

హనుమాన్ శోభాయాత్రను శాంతియుతంగా జరుపుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న సీపీ కల్మేశ్వర్

వినాయక్‌నగర్, ఏప్రిల్ 20 : హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 23న నిర్వహించే శోభాయాత్రను శాంతియుతంగా జరుపుకోవాలని సీపీ కల్మేశ్వర్ సూచించారు. కమిషనరేట్‌లోని కమాండ్ కంట్రోల్ భవనంలో విశ్వహిందూ పరిషత్, హిందూవాహిణి, బజరంగ్ దళ్ సభ్యులతో శనివారం రాత్రి శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. పుకార్లను నమ్మవద్దని, ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు, పాటలు పెట్టవద్దని, సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు చేయవద్దని సూచించారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలో నిర్వహించే హనుమాన్ శోభాయాత్ర ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. నిర్వాహకులు, భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు. సమావేశంలో అదనపు డీసీపీ కోటేశ్వరరావు, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, ట్రైనీ ఐపీఎస్ చైతన్యారెడ్డి, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, ఎస్‌బీఐ శ్రీశైలం, సీఐలు పాల్గొన్నారు.

పంచాయతీ ఆపరేటర్లకు సన్మానం

ఆపరేటర్లను సన్మానిస్తున్న డీపీవో తరుణ్ కుమార్

వర్ని, ఏప్రిల్ 20 : గ్రామ పంచాయతీ రికార్డులను కంప్యూటర్లలో నమోదు చేయడంలో ప్రతిభ కనబర్చిన మండలంలోని నలుగురు ఆపరేటర్లను డీపీవో తరుణ్ కుమార్ శనివారం ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ పంచాయతీ నమోదు కార్యక్రమంలో జిల్లాలో మూడో స్థానంలో నిలిచిన వర్ని మండలంలోని పంచాయతీ ఆపరేటర్లు కొప్పాక రవి, వాక్డోత్ శ్రీనివాస్, బబిత, షేక్ అయూబ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బోధన్ డివిజనల్ పంచాయతీ అధికారి సాయిబాబా, డీపీఎం నరహరి, వర్ని ఎంపీవో చందర్ పాల్గొన్నారు.

రైలు కింద పడి మహిళ మృతి

- కదులుతున్న ట్రైన్ ఎక్కే క్రమంలో ప్రమాదం

వినాయక్‌నగర్, ఏప్రిల్ 20 : ప్లాట్‌ఫాంపై నుంచి కదులుతున్న రైలు ఎక్కే క్రమంలో కాలు జారి రైలు కింద పడి శనివారం ఓ మహిళ మృతిచెందింది. నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో జరిగిన ఘటన వివరాలను ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. కామారెడ్డికి చెందిన పసూల రేవతి (39) నిజామాబాద్‌లోని తమ బంధువుల అంత్యక్రియల కోసం శుక్రవారం వచ్చింది. శనివారం ఉదయం 6 గంటలకు కామారెడ్డి వెళ్లేందుకు నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లోని మూడో నంబర్ ప్లాట్‌ఫాంపై కదులుతున్న రైలు ఎక్కేందుకు ప్రయత్నించింది. ప్రమాదవశాత్తు ట్రైన్ కింద పడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రైవేట్ డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 20 : యూనివర్సిటీ పరిధిలో కనీస నిబంధనలు పాటించకుండా, డెవలప్‌మెంట్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. యూనివర్సిటీ ఆడిట్ సెల్ డైరెక్టర్‌కు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, ఫీజు కట్టకుంటే ఎగ్జామ్ ఫీజు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. కళాశాలల్లో తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న వారికి 250 రోజులు పని కల్పించాలి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 20 : మండలంలో ఉపాధిహామీ కూలీలతో ఏఐపీకేఎంఎస్ నాయకులు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సాయాగౌడ్ మాట్లాడుతూ.. జాబ్‌కార్డు ఉన్న కుటుంబానికి 250 రోజుల పనిదినాలు కల్పించాలని, రోజూవారి కూలి రూ.600 తగ్గకుండా ఇవ్వాలని అన్నారు. పని ప్రదేశంలో టెంట్, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు కూలీలు చనిపోతే రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు.

మగ్గం వర్క్ శిక్షణ ప్రారంభం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 20 : ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ కార్యాలయంలో మగ్గం శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా డీఆర్డీవో సాయాగౌడ్ హాజరై మాట్లాడారు. ఈ శిక్షణ మహిళకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని, మహిళలు ఆర్థికంగా ఎదగడానికి దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, సిబ్బంది భాగ్యలక్ష్మి, రామకృష్ణ, నవీన్, రంజిత్, ఫరీదా తదితరులు పాల్గొన్నారు.

పీజీ పరీక్షలు ప్రారంభం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 20 : టీయూ పరిధిలో పీజీ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఎంబీఏ, ఎంసీఏ, 6వ సెమిస్టర్ ఐఎంబీఏ, 10వ సెమిస్టర్లు ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, ఒకటో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ప్రారంభమైనట్లు తెలిపారు. గిరిరాజ్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల–నిజామాబాద్, ప్రభుత్వ కళాశాల –బోధన్, తెలంగాణ వర్సిటీ కళాశాల, తెలంగాణ వర్సిటీ న్యాయ కళాశాల సెంటర్లలో పరీక్షలు కొనసాగుతున్నాయని తెలిపారు. మొత్తం 574 విద్యార్థులకు 551 మంది హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ గంటా చంద్రశేఖర్ తెలిపారు.

కొనసాగుతున్న బీఎడ్ పరీక్షలు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 20 : టీయూ పరిధిలో బీఎడ్ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. మూడో రోజు శనివారం నిర్వహించిన పరీక్షలకు 1311 విద్యార్థులకు 1257 మంది హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ గంటా చంద్రశేఖర్ తెలిపారు. ఆర్మూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదైనట్లు తెలిపారు.

గడ్డివాము దగ్ధం

రుద్రూర్, ఏప్రిల్ 20 : మండలకేంద్రంలో ప్రమాదశాత్తు నిప్పంటుకొని గడ్డివాము దగ్ధమైంది. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గడ్డివాముకు నిప్పంటుకోవడం గమనించిన హనుమాన్ మాలధారులు.. నీటితో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. యజమాని నెమలి జగన్‌కు సమాచారం అందజేశారు. రూ. 50 వేల విలువ చేసే పశుగ్రాసం కాలి బూడిదైనట్లు బాధిత రైతు తెలిపాడు.

గురుకుల పాఠశాలకు విద్యార్థుల ఎంపిక

వేల్పూర్, ఏప్రిల్ 20: మండలంలోని పడిగెల్ ప్రాథమిక పాఠశాలకు చెందిన 15 మంది నాలుగో తరగతి విద్యార్థులు ఐదో తరగతిలో గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించారని ప్రధానోపాధ్యాయుడు జమాలుద్దీన్ శనివారం తెలిపారు. పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయగా 15 మంది ఎంపికయ్యారని, ఇప్పటివరకు తమ పాఠశాల నుంచి 220 మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు.

ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఫైర్ సిబ్బంది సేవలు రిస్క్‌తో కూడుకున్నవి

పరికరాలను పరిశీలిస్తున్న సీపీ కల్మేశ్వర్

వినాయక్‌నగర్, ఏప్రిల్ 20 : అగ్నిమాపక శాఖ సిబ్బంది సేవలు ఎంతో రిస్క్‌తో కూడుకున్నవని, ఫైర్ యాక్సిడెంట్ జరిగిన సమయంలో సిబ్బంది తమ ప్రాణాలను లెక్కచేయకుండా సేవలందిస్తారని సీపీ కల్మేశ్వర్ కొనియాడారు. జిల్లాకేంద్రంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అగ్నిమాపక శాఖ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి సీపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సిబ్బంది ఆయనకు గౌరవ వందనం చేశారు. ఫైర్ పరికరాలు, ప్రమాదాలు జరిగినప్పుడు వినియోగించే వివిధ పరికరాలను సీపీ కల్మేశ్వర్‌కు జిల్లా ఫైర్ ఆఫీసర్ మురళీ మనోహర్‌రెడ్డి వివరించారు. ఫైర్ ఆఫీసర్లు, సిబ్బందిని సీపీ అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ భాను ప్రతాప్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతమ్మ తల్లిని అశ్లీలంగా చిత్రీకరించిన వారిపై చర్యలు తీసుకోవాలి

వినాయక్‌నగర్, ఏప్రిల్ 20 : హిందూ దేవత సీతమ్మ తల్లిని అశ్లీలంగా చిత్రీకరించి సోషల్ మీడియాలో ప్రచారం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నేతలు సీపీ కల్మేశ్వర్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. ప్రధాని మోదీని రాముడిగా, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను లక్ష్మణుని వేషధారణలో చూపిస్తూ వారి మధ్యలో సీతమ్మను అశ్లీలంగా చిత్రించి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి తదితరులు ఉన్నారు.

వర్షానికి దెబ్బ తిన్న పంటల పరిశీలన

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్20: ఆలూర్ మండలంలోని దేగాం గ్రామంలో శుక్రవారం కురిసిన వర్షాలకు దెబ్బ తిన్న పంటలను ఏవో హరికృష్ణ శనివారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలను పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ విస్తరణ అధికారులు పరిశీలిస్తున్నారని అన్నారు. ఆయన వెంట ఏఈవో నరేశ్, షరత్‌చంద్ర, వసంత లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ ఆలూర్ శ్రీనివాస్, దేగాం మాజీ సర్పంచ్ గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయాలి

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్20: అన్ని రకాల విత్తనాలను 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేయాలని ఏఐపీకేఎస్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని కుమార్ నారాయణ్ భవనంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ యంత్రాలు, మినీ ట్రాక్టర్స్, అన్ని రకాల విత్తనాలను 50శాతం సబ్సిడీపై ఇవ్వాలనే డిమాండ్‌తో వచ్చేనెల 15వ తేదీ నుంచి జూన్ మొదటి వారం వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు దేవారాం, రాజన్న, గంగాధర్, ఆకుల గంగారాం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి మహాపూజ

డిచ్‌పల్లి, ఏప్రిల్ 20 : మండలకేంద్రంలో ఆంజనేయ స్వామి మహాపూజను పిట్ల కృష్ణ మహరాజ్, నాగభూషణం గురుస్వామి ఆధ్వర్యంలో శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహాగణపతి, నవగ్రహ, గౌరీమాత, ఆంజనేయ స్వామికి అభిషేకాలు నిర్వహించారు. డిచ్‌పల్లి, ధర్పల్లి మండలాల నుంచి మాలధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మణికంఠ, లక్ష్మీనర్సయ్య, స్వామి ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు కొనసాగాయి. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఘనంగా పంప సాహితీ పీఠం కవి సమ్మేళనం

కవులను సన్మానిస్తున్న వక్తలు

బోధన్, ఏప్రిల్ 20: క్రోధి నామ సంవత్సరం, ఉగాదిని పురస్కరించుకుని బోధన్ పట్టణంలో పంప సాహితీ పీఠం ఆధ్వర్యంలో శనివారం రాత్రి కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా శ్రీ విజయసాయి హైస్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, విద్యావికాస్ జూనియర్ కళాశాల చైర్మన్ వై.శ్రీనివాస్, ఉషోదయ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ హాజరయ్యారు. పంప సాహితీ పీఠం అధ్యక్షుడు పురాణే అజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. బోధన్ ప్రాంతం నుంచే కాకుండా నిజామాబాద్, బాన్సువాడ ప్రాంతాల నుంచి కవులు, రచయితలు హాజరై తమ కవితలను వినిపించారు. పీఠం అధ్యక్షుడు పురాణే అజయ్‌కుమార్ మాట్లాడుతూ పంప కవి పేరిట ఏర్పడిన తమ సాహితీ సంస్థ బోధన్ ప్రాంతంలో కవులు, రచయితలను ప్రోత్సహించేవిధంగా కార్యక్రమాలు చేపడుతున్నదని అన్నారు. హాజరైన కవులు, రచయితలను పంప సాహితీ పీఠం నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో పంప సాహితీ పీఠం గౌరవ అధ్యక్షుడు ఎం.రాజేశ్వర్‌రావు, ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ భారతి, ప్రధాన కార్యదర్శి పబ్బ మురళి, పీఠం ప్రతినిధులు శేషతల్పసాయి, అమరావతి, లోల శంకర్, ఉషకోయల సత్యనారాయణ, కవులు పుండరీక్‌గౌడ్, మొగిలి స్వామిరాజ్, హరిప్రియ, చిన్న శంకర్, సిర్ప లింగం, శిరీశ్, నాయని రాములు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేస్తే రైతులు సోమరులవుతారంట

ఎంపీ అర్వింద్‌పై కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఆరోపణ

ఎడపల్లి/రెంజల్, ఏప్రిల్ 20: రుణమాఫీ చేస్తే రైతులకు సోమరితనం అలవాటు అవుతుందని ఎంపీ అర్వింద్ అన్నాడని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఎడపల్లి, రెంజల్ మండలం సాటాపూర్‌లో శనివారం ఆపార్టీ మండల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయా సమావేశాల్లో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితోకలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉచిత విద్యుత్, రుణమాఫీ పథకాలు అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. బోధన్‌లో నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించే బాధ్యత తమపై ఉందని అన్నారు. గత ఎన్నికల్లో అబద్ధాలు చెప్పి గెలుపొందిన అర్వింద్‌ను వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని ఓటర్లను కోరారు. బోధన్ ఎమ్మెల్యే సమక్షంలో నీలా ఎంపీటీసీ సభ్యురాలు స్వప్నా రాంచందర్, మాజీ సర్పంచ్ రఘు, యువకులు కాంగ్రెస్‌లో చేరారు. సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహేర్‌బిన్ హందాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లిలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

తాగునీటి సమస్య పరిష్కరించండి

బోధన్ ఎమ్మెల్యేకు ప్రజల మొర

రెంజల్, ఏప్రిల్ 20: ఇటీవల గోదావరిలో మునిగి మండలంలోని కందకుర్తికి చెందిన విద్యార్థి నబాజ్ బేగ్ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. ఆయన తిరిగి వస్తుండగా 7వ వార్డుకు చెందిన ప్రజలు వచ్చి తాగునీటి సమస్య పరిష్కరించి దాహార్తి తీర్చాలని మొరపెట్టుకున్నారు. వర్షాలకు ఇందిరమ్మ కాలనీలో పాఠశాల దారి బురదమయం అయ్యిందని, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే నీటి సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మున్నీనాయక్‌ను ఫోన్‌లో ఆదేశించారు.

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న కాలనీ వాసులు

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K Ph: 9640258899/9640468899

NT-311829

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆంధ్ర గొర్రెల పెంపకందారులపై దాడి

గొర్రె పొట్టేలును తీసుకెళ్తున్న ఆరె కటికె వ్యాపారి

నవీపేట, ఏప్రిల్ 20: నవీపేట మేకల సంతలో గొర్రె పొట్టేళ్లు కొనుగోలు చేసేందుకు వచ్చిన ఆంధ్ర గొర్రెల పెంపకందారులపై నిజామాబాద్ ఆరె కటికె వ్యాపారులు దాడి చేశారు. శనివారం మండల కేంద్రంలో మేకల సంతకు ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం నుంచి 20 మంది గొర్రెల పెంపకందారులు వచ్చారు. 50 గొర్రె పొట్టేళ్లను కొనుగోలు చేశారు. వారు అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారనే నేపంతో మొత్తం గొర్రె పొట్టేళ్లను నిజామాబాద్ ఆరె కటికె వ్యాపారులు ఎత్తుకెళ్లారు. అనంతరం వీటిలో 30 గొర్రెలను తిరిగి ఇచ్చి మిగతా 20 జీవాలను వారి వ్యాన్‌లో వేసుకున్నారు. వాటిలో ఒక గొర్రె మృతి చెందింది. మిగతావి అస్వస్థతకు గురయ్యాయి. దీంతో ఆంధ్ర గొర్రెల పెంపకందారులు ఆరె కటికె వ్యాపారులపై శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు గొల్ల, కురుమలకు గొర్రెల పెంపకం పథకంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల నుంచి గొర్రెలను తెలంగాణకు తీసుకురావడంతో అక్కడ గొర్రెల కొరత ఏర్పడిందని వారు పేర్కొన్నారు. దీంతో తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచ